# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 21 సెప్టెంబర్ : 2018 విడుదల : 1

# మీ

# దేవుని సన్నిధిని

# కనబడుటకై

# సిద్ధపడుడి

**ఆమోసు 4:12**

**పరిపూర్ణ విడుదల**

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

సెప్టెంబర్ - 2018

**సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.100/-**

## విషయసూచిక

| | | |
|---|---|---|
| **1.** | ఎడిటర్ అర్పణ | **3-8** |
| **2.** | ఇరుకులో విశాలత | **9** |
| **3.** | సిద్ధపాటు | **10-13** |
| **4.** | దేవుని ప్రణాళిక | **14-15** |
| **5.** | యరోబాము | **16-19** |

**సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన**

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥9.00 ల నుండి ఉ॥5.00 గం॥ల వరకు

# ఎడిటర్ అర్పణ

**మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా హృదయ పూర్వక వందనములు తెలియజేయుచున్నాను.**

**"యెహోవా అతనికి తోడైయుండెననియు, అతడు చేసినదంతయు అతని చేతిలో యెహోవా సఫలము చేసెననియు అతని యజమానుడు చూచినప్పుడు యోసేపుమీద అతనికి కటాక్షము కలిగెను" ఆది. 39:3.**

యాకోబుకు పన్నెండుమంది కుమారులున్నారు. యోసేపు వారిలో పదకొండవ కుమారుడు. యోసేపు పదునేడేండ్లవాడై తన సహోదరులతో కూడ మందను మేపుచుండెను. అప్పుడు యోసేపు వారి చెడుతనమును గూర్చిన సమాచారము తన తండ్రియొద్దకు తెచ్చుచుండువాడు. అతని సహోదరులు తమ తండ్రి అతనిని తమ అందరికంటె ఎక్కువగా ప్రేమించుట చూచినప్పుడు వారు అతనిమీద పగపట్టి, అతనిని క్షేమసమాచారమైనను అడుగలేకపోయిరి.

ఒకనాడు అతని సహోదరులు షెకెములో తమ తండ్రి మందను మేపుటకు వెళ్లిరి. అప్పుడు యాకోబు యోసేపుతో నీవు వెళ్లి నీ సహోదరుల క్షేమమును మంద క్షేమమును తెలిసికొని నాకు వర్తమానము తెమ్మని చెప్పెను. యోసేపు వారిని షెకెములో కనుగొనలేదు గాని ఒక మనుష్యుడు తన అన్నలను గూర్చి చెప్పిన సమాచారము విని దోతానుకు వెళ్లెను. అతడు దగ్గరకు రాకమునుపు వారు దూరమునుండి చూచి అతనిని చంపుటకు దురాలోచన చేసిరి. వారు ఇదిగో కలలు కనువాడు వచ్చుచున్నాడు వాని చంపి యిక్కడనున్న ఒక గుంటలో పారవేసి, దుష్టమృగము వీని తినివేసెనని చెప్పుదము అప్పుడు వీని కలలేమగునో చూతము రండని ఒకనితో ఒకడు మాటలాడుకొనిరి. రూబేను అతనిని విడిపింపదలచి నీళ్లు లేని గుంటలో పడవేయమని చెప్పెను. యూదా – ఇతడు మన సహోదరుడు ఇతనిని చంపినందువలన మనకు ఏమి ప్రయోజనము అని చెప్పి ఇష్మాయేలీయులకు ఇరువది తులముల వెండికి అమ్మివేసెను. వారు యోసేపు అంగిని తీసికొని ఒక మేకపిల్లను చంపి దాని రక్తములో ఆ అంగిముంచి తండ్రియొద్దకు తెచ్చి ఇది మాకు దొరికెను దీనిని గురుతుపట్టుమని చెప్పిరి.

తమ తమ్ముడైన యోసేపును అమ్మాలి అనుకొని అమ్మివేశారు, అతని వస్త్రాలను మేకరక్తంలో ముంచాలి అనుకొని ముంచివేశారు. యోసేపు వస్త్రాలను మేకరక్తంలో ముంచి చూపిస్తే యాకోబు కనుగొనలేకపోయాడు. ఎవ్వరు గర్తుపట్టలేనంత జ్ఞానయుక్తముగా వారి ఆలోచనలు ఉంటాయి. నీకు ఎంత జ్ఞానమైన ఉండవచ్చు ఎంత సమయోచితముగానైన నీవు మాట్లాడవచ్చు ఒక విషయాన్ని చాకచక్యంగా చేసే సామర్థ్యము ఉండవచ్చు అయితే దేవుడు గనుక నీకు తోడుగా లేకపోతే నీవు చేసేది అంతా సున్నా. నీవు మంచిగా చదువగలవు, బాగా పరీక్ష వ్రాయగలవు అయితే నీకు దేవుడు తోడుగా ఉన్నాడా? దేవుడు నీకు తోడుగా ఉంటేనే నీవు జయమును చూడగలవు.

యోసేపును ఐగుప్తునకు తీసికొని వచ్చినప్పుడు ఫరో యొక్క ఉద్యోగస్థుడును రాజసంరక్షక సేనాధిపతియునైన పోతీఫరను ఒక ఐగుప్తీయుడు ఇష్మాయేలీయులయొద్ద అతనిని కొనెను. యెహోవా యోసేపునకు తోడైయుండెను గనుక అతడు అన్ని విషయములలో వర్ధిల్లుచూ తన యజమానుడగు ఆ ఐగుప్తీయుని యింట నుండెను. ఆ యింటికి యజమానుడగు పోతిఫరు దేవుడు యోసేపునకు తోడుగా ఉండుటయు అతడు చేయు ప్రతి పనిని యెహోవా సఫలముచేయుటయు చూచెను. యోసేపు నేనెందుకు ఇక్కడ ఉండాలి అని గాని, నా అన్నలు నన్ను అమ్ముకొనుట ఏమిటి అని గాని ఎక్కడా కృంగిపోలేదు.

దేవుడు మనకు తోడుగా ఉన్నాడు అనే విషయాన్ని మనము ఏలాగు గుర్తించగలము? ఒక్కటే గుర్తు దేవుడు నిన్ను ఎటువంటి పరిస్థితులలో నడిపించుచున్నను నీ అణువణువున కృంగుదల అనేది కనబడదు. నీ ముఖంలో, నీ నడకలో, నీ జీవితంలో కృంగుదల అనేది ఎక్కడ కనబడదు. పరిస్థితులను చూచి కృంగిపోవడం అనేది నీ జీవితంలో ఉండకూడదు. తనను ఇక్కడున్నావని అడిగితే వారికి ఏమి సమాధానం చెప్పాలో, పోతిఫరు ఇంటిలో ఇంకా ఎంతకాలం పనిచేయాలో తనకు తెలియదు. యోసేపు పరిస్థితులన్ని అతనిని కృంగదీసేవే అయినా నిరాశపడలేదు. నీ పరిస్థితులన్నీ నిన్ను కృంగదీసేవే అయినా దేవుడు నీకు తోడుగా ఉంటే నిరాశ అనేది ఉండదు. కొన్నిసార్లు ప్రభువు నిన్ను ఎలా

నడిపిస్తారు అంటే నీ అంతరంగం విప్పి చెప్పుకోవడానికి కూడా నీకు ఎవరు ఉండరు. అప్పుడు నీవు కృంగిపోకూడదు. నీ కుటింబికులను బట్టి గాని నీ మనస్తత్వాన్ని బట్టి గాని నీవు కృంగిపోకూడదు.

యేసుప్రభువును శిష్యులందరు విడిచిపెట్టి వెళ్ళిపోయారు ఆయన సేవంతా పాడైపోయినట్లు అనిపించింది. అయినను ఆయన కృంగిపోలేదు గాని వాటన్నింటి మధ్య ఆయన తండ్రిచిత్తం చేశారు. పౌలు కొరింథీయులతో **"మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని ఎరిగి స్థిరులును కదలనివారును ప్రభువుయొక్క కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులనై యుండుడి" 1కొరింథి.15:58** అని చెప్పెను.

ఒకప్పుడు అమెరికా 70వేల మంది మిషనరీలను పంపించినది. ఆసియాలో ఉన్న సౌత్ కొరియా చిన్న దేశం అయినను 28వేల మిషనరీలను పంపినది. ఆసియాలో ఉన్నవారందరు నన్ను విడిచిపెట్టి వెళ్లారు అని పౌలు చెప్పెను 2తిమోతి.1:15. ఆసియా కొరకైన భారముతో పౌలు పడిన ప్రయాసంతా శూన్యముగా కనిపించినది. కాని తదుపరి కాలములో అదే ఆసియా ఖండము నుండి ప్రపంచమంతటికి మిషనరీలను పంపించబడటం కనబడుచున్నది. ఆ రోజు కలిగిన పరిస్థితులను బట్టి పౌలు కృంగిపోయినట్లయితే ఆసియాలో మిషనరీలు కనబడేవారు కాదు. నీవు కృంగిపోకుండా ఉన్నట్లయితే ప్రభువు నీకు తోడైయుండి నీ ప్రయాసను ఏదో ఒకరోజు ఫలభరితంగా మారుస్తారు. పౌలుకు కలిగిన పరిస్థితులు మనకు లేవు. పౌలును ఆసియాలో ఉన్నవారందరు ఎందుకు విడిచివెళ్లినారో కారణాలు వ్రాయలేదు. కారణాలు ఏవైనా వాటన్నింటి మధ్య పౌలు నిబ్బరము కలిగి ధైర్యంగా ఉన్నాడు.

ఒకవ్యక్తి విలియం కేరి గారి దగ్గరకు వచ్చి నీ కుమారుడు చావు బ్రతుకుల్లో ఉన్నాడు పరిస్థితులు దారుణంగా ఉన్నాయి ఇంత క్లిష్టపరిస్థితులలో మీరు ఏమి చేయదలచుకొంటున్నారు అని అడుగగా ప్రభువు దగ్గరకు వెళతాడు అక్కడకు నేను కూడా వెళ్లి కలుస్తాను అని చెప్పాడు. మరొకసారి తాను శ్రమపడి తర్జుమా చేసిన బైబిల్ అంతా కాలిపోగా నీవు పడిన ప్రయాసంతా అగ్నిలో

కాలిపోయినది కదా అని ప్రశ్నించగా ఇప్పుడు నా విశ్వాసం మరి అధికమవుతుంది అని చెప్పారు.

ఒకరోజు డి.ఎల్.మూడి గారు సువార్త ప్రకటించి ఇంటికి వచ్చి కిటికీ తలుపు చూస్తే మొత్తం కాలిపోతూ ఉంది. అప్పుడు తనతో ఉన్న వ్యక్తి ఆర్పడానికి ప్రార్థన చేస్తారా అని అడుగగా ఆర్పమని ప్రభువును అడగటం నాకు ఇష్టంలేదు. అది కాలిపోతుంది అంటే ఇంకేదో శ్రేష్టమైనది ప్రభువు నాకివ్వబోతున్నాడు అని చెప్పారు. ప్రభువునుబట్టి వారికున్న ధైర్యం ఎంతో గొప్పది. వీరి నోటనుండి వచ్చిన విశ్వాసపు మాటలు ఎంతో ధైర్యమును ఇస్తున్నాయి. వీరందరు వారికి ఎదురైన పరిస్థితులలో తమ ధైర్యమును కాపాడుకొన్నారు.

పరిస్థితులను చూసి కృంగిపోయే వ్యక్తివిగా నీవు ఉండకూడదు. యోసేపు జీవిత చరిత్రలో పోతిఫర్ భార్య తనమీద చెడ్డనేరం మోపిన, సింహాసనం ఎక్కి పరిపాలించవలసిన అనుభవము అంతకుముందు తనకెన్నడు లేకపోయిన ఆలోచన చెప్పేవారే కనబడకపోయినను అతడు కృంగిపోలేదు. యోసేపుకు కలవరం లేదు, కృంగిపోలేదు, ఈ పరిస్థితులలో ఎలా నడవాలి అని అనుకొనలేదు. నీవు భరించలేని శ్రమ ఎప్పుడు నీ జీవితంలో ప్రభువు అనుమతించడు. ఒకవేళ శ్రమ నీ జీవితంలోకి తీసికొని వస్తే ఆ శ్రమను భరించగలిగిన కృపను కూడా ప్రభువు నీకిస్తారు. పౌలుకు ముల్లు ఉంది ఆ ముల్లును భరించగలిగిన కృపకూడా ఉంది. యోబు భార్య దేవుని దూషించి నీవు చనిపోమని చెప్పినను నా విమోచకుడు సజీవుడు నేను ఆయనను కన్నులారా చూస్తాను అని చెప్పెను.

**“మీ ధైర్యమును విడిచిపెట్టకుడి దానికి ప్రతిఫలముగా గొప్ప బహుమానము కలుగును” హెబ్రి.10.35.** నీ జీవితంలో చివరి నిమిషం వరకు ధైర్యాన్ని కాపాడుకొనవలెను. నీ నడకలో నీ పలుకులో ఆ విశ్వాసం కనబడాలి. యోసేపు తన జీవితములో నిబ్బరమైన బుద్ధిగలవాడై ధైర్యంగా దేవుని కొరకు ముందుకు వెళ్ళిపోయాడు. నీవు నేను కృంగిపోకుండ నిబ్బరం గలవారిగా ఉండి దేవుడు మనకప్పగించిన దానిని చివరి నిమిషం వరకు చేయాలి.

**"దేవుడే ఫరోకు క్షేమకరమైన ఉత్తరమిచ్చును" ఆది. 41:16.** యోసేపు దేవుని ఎరుగని రాజుతో మరియు కలవరములతో నిండిపోయిన ఫరోకు క్షేమకరమైన ఉత్తరమిచ్చెను. దేవుడు నీకు తోడైయుంటే వెళ్లుచున్న త్రోవలో అన్యుల ఎదుటనైనను కలవరములతో కూడిన పరిస్థితులోనైనను ఎల్లప్పుడు ఆయన నామములో క్షేమాన్నే ప్రకటిస్తావు. **"వినువారికి మేలు కలుగునట్లు అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకుడి" ఎఫెసి. 4:29.** యోసేపు విశ్వాసముతో పలికిన మాటలను ప్రభువు స్థిరపరచినారు. **"మరియు యోసేపు – దేవుడు నిశ్చయముగా మిమ్మును చూడవచ్చును; అప్పుడు మీరు నా యెముకలను ఇక్కడనుండి తీసికొనిపోవలెనని ఇశ్రాయేలు కుమారులచేత ప్రమాణము చేయించెను" ఆది. 50:25.** ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశములోనికి అడుగుపెట్టుటకు కొన్ని వందల సం॥లకు ముందే యోసేపు విశ్వాసంతో కూడిన మాటలను పలికెను. నీకు ఆయన తోడుగా ఉంటే నీ మాటలలో విశ్వాసాన్ని కనుపరుస్తావు.

**"మీ హృదయమును కలవరపడనియ్యకుడి... నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును మీకుస్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను" యోహాను 14:1-3.** యేసుప్రభువు చనిపోవడానికి ముందుగా శిష్యులతో మీరు కలవరపడకండి నేను తండ్రియొద్దకు వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచి మరల వచ్చి నేను మిమ్మును తీసుకొనివెళతాను అని చెప్పెను. ఆదరణకర్తను నేను మీకు తోడుగా పంపిస్తాను అని చెప్పెను.

ఒక క్రైస్తవుడి యొక్క భక్తిజీవితం కఠినమైన పరిస్థితులలో గుండా వెళ్లుచున్నప్పుడును మరణకాలములోను అతని విశ్వాస పరిమాణం ఎంతో బయటపడుతుంది. దేవుడు నీకు తోడుగా ఉంటే నేను ఏమి చేయలేను నా జీవితం వ్యర్థమైపోయింది అనే ఆలోచన నీ మనస్సులో ఎక్కడా ఉండదు. నీ విశ్వాస ప్రయాణం ప్రత్యేకముగా ఉంటుంది. 110 సం॥ల ప్రాయంలో కూడా నీ విశ్వాసం తొణికిసలాడుతుంది. దేవుని కొరకు ఏదైనా చేయాలనే ఆశ నీకున్నప్పుడు ఏ పరిస్థితుల్లోనైనా నీ విశ్వాసం చెక్కుచెదరదు. నీకు విశ్వాసము ఉన్నప్పుడు ఎంత ప్రార్థన చేసినను నా పరిస్థితి మారలేదు అని అనుకొనలేవు.

ఎందుకంటే కాలము సమయము ప్రభువు చేతిలో ఉన్నవి. నీవు నిబ్బరము కలిగి ఆయన మీద ఆనుకొనినప్పుడు ఎప్పుడు ఏమి చేయాలో అది ఆయన చేస్తారు. వినుట వలన విశ్వాసం కలుగుతుంది. నీవు వాక్యం మీద దృష్టి నిలిపినప్పుడు నీకు కృంగుదల ఉండదు. కృంగిపోవుటకు ఆయన నిన్ను పిలువలేదు.

యోసేపు కొంతకాలము నాలుగుగోడల మధ్య జైలులో ఉన్నాడు. యోసేపుకు విడుదల ఎప్పుడో తెలియకపోయినను దేవుని ప్రత్యక్షత దొరకకపోయినను అతడు కృంగిపోలేదు. యోసేపుతో ఆ కష్టకాలంలో దేవుడు మాట్లాడకపోయినను యోసేపుకు ఆయన తోడుగా ఉన్నాడు. కొన్నిసార్లు ఆయన నీ ప్రార్థనలకు జవాబివ్వని దినాలుంటాయి అప్పుడు నీవు దిగజారిపోకూడదు. ఫరో జీవితంలో యోసేపు పలికిన మాటలను ప్రభువు నెరవేర్చారు. ప్రభువు యోసేపును చెరసాలలో నుండి బయటకు తీసికొని వచ్చి ఐగుప్తు సింహాసనం మీద కూర్చొండబెట్టారు. దేవుడు నీకు తోడుగా ఉంటే నీ మనస్సులో నీవెన్నడును కృంగుదలకు తావివ్వవు. నీ నోటనుండి క్షేమాన్ని ప్రటిస్తావు. అచంచల విశ్వాసముతో ముందుకే సాగెదవు కాని నీ ఆత్మీయ ప్రయాణములో ఎన్నడు ఆగిపోవు. యోసేపుకు తోడైయున్న దేవుడు నేడు మనకును తోడైయున్నాడు. యుగసమాప్తివరకు ఆయన మనకు తోడుగా ఉన్నాడు.

ప్రియులారా! సెప్టెంబరు 17 నుండి అక్టోబరు 17 వరకు ప్రార్థనా మాసమని మనమెరుగుదుము. యథావిధిగా ఈ మాసమంతా సహవాసమంతట ఉపవాస ప్రార్థనలు జరుగును గనుక మన పితరుడైన యోసేపుకు దేవుడు తోడైయుండి అతడు చేసినదంతయు ప్రభువు సఫలము చేసినట్లుగా మనకును ప్రభువు తోడైయుండి మన ప్రార్థనలన్నియు ఆయన సఫలపరచును. మన పరిస్థితులు, సమస్యలు ఏవిధముగా ఉన్నప్పటికిని దేనిని బట్టి కృంగిపోక అచంచల విశ్వాసముతో ముందుకు కొనసాగి రాజులకు క్షేమకరమైన ప్రత్యుత్తరమిచ్చునట్లుగా ఈ ప్రార్థనా మాసములో ప్రభువు యొక్క ఆత్మ మనకు తోడైయుండి సహాయము చేయును గాక!

**– ఎడిటర్**

## ఇరుకులో నాకు విశాలత కలుగజేసినవాడవు నీవే కీర్తన.4:1

దేవుని నీతి ప్రభుత్వం పక్షంగా ఒక మానవుడు ఇవ్వగలిగిన అత్యుత్కృష్టమైన సాక్ష్యం ఇదే. బాధల్లోనుండి తప్పించినందుకు మనిషి చెబుతున్న కృతజ్ఞత కాదిది. బాధల ద్వారానే విడిపింపు పొందిన మనిషి చెబుతున్న కృతజ్ఞత. "ఇరుకులో విశాలత కలుగజేసినవాడవు నీవే" ఇతడు అంటున్నాడు – జీవితంలోని బాధలే విశాలతకి మూలకారణాలైనాయట.

ఇది సత్యమేనని నువ్వూ నేనూ అనేకసార్లు అనుభవపూర్వకంగా భావించాం గదూ. యోసేపు చీకటికొట్టులో ఉన్నప్పుడు దృఢచిత్తుడయ్యాడని వ్రాసి ఉంది కదా. యోసేపుకు కావలసింది ఇదే. ఇనుములాగా దృఢమైన మనస్సు. అప్పటిదాకా బంగారపు మెరుగుల్నే అతడు చూశాడు. తన యవ్వన ప్రాయపు కలల్లో తేలియాడాడు. విఫలమైన ప్రేమ గురించి కన్నీళ్లు కార్చేవాడు. వాస్తవిక జగత్తుకి దూరమయ్యాడు, నిజమైన విచారం ఏమిటో అతనికి తెలియదు. మన మనస్సు ఇనుములాగా తయారవ్వాలి. బంగారం ఒక కలలాంటిది. ఇనుము వాస్తవిక జీవితం. నిన్ను మానవత్వంతో కలిపి కట్టే గొలుసు ఇనుపదై ఉండాలి. ప్రపంచంతో మనలను ఏకంచేసే బంధం సంతోషం కాదు, విచారమే. బంగారం ఎక్కడబడితే అక్కడ దొరకదు. ఇనుము ఎక్కడ చూసినా ఉంటుంది.

మానవాళిపట్ల సానుభూతితో నీ హృదయం విశాలం కావాలంటే మానవ శ్రమల ఇరుకుల్లోకి నువ్వు వెళ్లాలి. యోసేపు ఉన్న కారాగారమే అతని సింహాసనానికి దారి. నీ శరీరం ఇనుములాగా గట్టిది కాకపోతే నీ సోదరుడి వీపుపైనున్న భారాన్ని నువ్వు ఎత్తుకోలేవు. నీ ఇరుకే నీకు విశాలత. నీ జీవితంపై పడే నీడలే నీ మహిమ స్వప్నాల జాడలు. నీడలను చూసి విసుక్కోవద్దు. నీ కలలకంటే నీడలే నీకు మేలు చేస్తాయి. చెరసాల నీడలు నిన్ను కట్టిపడేశాయని అనుకోవద్దు. ఆ బంధకాలే నువ్వు మానవత్వపు అంచులకు ఎగిరిపోవడానికి సహాయపడే రెక్కలు. కారాగారపు తలుపులే ప్రపంచపు గుండె లోతుల్లోకి ద్వారాలు. విచారపు సంకెళ్లతో దేవుడు నిన్ను బంధించడం మూలంగా నిన్ను విశాలతలోకి నడిపించాడు.

యోసేపు ఐగుప్తు ఖైదీ కాకపోయినట్టయితే దానికి ప్రధాని కూడ అయి ఉండేవాడు కాదు. అతని కాళ్లకు వేసిన ఇనుప గొలుసులే అతని మెడకు బంగారు గొలుసులు వేశాయి.

**"మీ దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి" ఆమోసు 4:12.**

మనము దేవుని సన్నిధిలో కనబడుట కొరకై సిద్ధపడాలి. మానవుని జీవితంలో చదువు ఉద్యోగం వివాహం ఆరోగ్యం ప్రయాణం ఎన్నోరకాల పనులు చేయవలసియున్నవి. ప్రతిదానికొరకై మనం సిద్ధపడుతూ ఉంటాము. వీటన్నింటి కంటే శ్రేష్టమైనది మనము దేవుని సన్నిధిలో కనబడుట కొరకు సిద్ధపడుట. ఎప్పుడు అటువంటి సిద్ధపాటు మనకుంటుందంటే దేవుని వాక్యానికి, ఆజ్ఞలకు లోబడినప్పుడు, దేవుని చిత్తానుసారంగా నడుస్తున్నప్పుడే ఆ సిద్ధపాటు మనకుంటుంది. దేవుడు మన హృదయములను చూస్తాడు. సిద్ధపాటు లేకపోతే మనము దేవుని సన్నిధిలో నిలువబడలేక పారిపోతూ ఉంటాము. మన హృదయంలో పాపం ఉన్నప్పుడు కూడా దేవుని సన్నిధిలో నిలువలేము.

ఆదాము హవ్వలు ప్రతి రోజు దేవునితో గడిపేవారు. చల్లపూటవేళ ప్రభువు వచ్చి వారితో మాట్లాడేవారు. ఎప్పుడైతే వారి హృదయాలలోనికి జీవితాలలోనికి దేవుని చిత్తంలోలేనిది వచ్చేసిందో దేవుని ముందు నిలువబడడానికి వారికి ధైర్యం లేదు. దేవుడు ఆదామును పిలిచి నీవు ఎక్కడ ఉన్నావనగా అతడు నీ స్వరము వినిప్పుడు భయపడి దాగుకొంటిననెను. రోజు వినే స్వరమే దేవుని ప్రేమలో మార్పులేదు, పిలుపులో మార్పులేదు. దేవుడు ఎన్నడు మారడు. ఆయన మార్పులేని దేవుడు. తరాలు మారినా, యుగాలు మారినా, జగాలు మారినా ప్రభువు ప్రేమ మాత్రం మారదు. ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞను అతిక్రమించారు గనుక భయపడినారు. దేవుని ముందు నిలువబడే శక్తి వారికిక లేదు గనుకనే వారు దిగంబరులై చెట్ల చాటుకు వెళ్ళి దాగుకొన్నారు. దేవుని సన్నిధిలో నిలువబడే ధైర్యం, దేవుని సన్నిధిలో నిలువబడే శక్తి, దేవుని సన్నిధిలో గడిపే ఆ అనుభవాలు వారు పోగొట్టుకొన్నారు. వారిక దేవుని తోటలో ఉండడానికి తగరు అందుకే తోటలోనుండి దేవుని చేత వెళ్లగొట్టబడినారు. మన హృదయాలు అంతరంగాలు ప్రభువుకు తెలుసు. ఎవరి హృదయంలోనైతే దేవుని యెదుట కనబడడానికి, దేవుని యొక్క మాటవినడానికి సిద్ధపాటు ఉంటుందో వారి మీద ఆయన కనుదృష్టి నిలుపుతారు.

అబ్రాహాము వయస్సు డెబ్బై ఐదు సంవత్సరాలు, వారికి పిల్లలు లేరు అబ్రాహాము శారా వృద్ధులైపోయారు. అలాంటి సమయంలో దేవుడు అబ్రాహామును

పిలిచి అబ్రాహామా నీవు లేచి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళు అని చెప్పెను. అబ్రాహాము యొక్క హృదయాన్ని దేవుడు చూసారు. నేను పిలిస్తే అబ్రాహాము పలుకుతాడని దేవునికి తెలుసు. దేవుని పిలుపుకు వెంటనే లోబడి లేచి ప్రయాణం ప్రారంభించాడు. దేవుడు పిలిస్తే పలకడానికి ఈ రోజు సిద్ధంగా ఉన్నామా! దేవుని స్వరం వినడానికి సిద్ధపాటుండాలి. మనం చాలాసార్లు ప్రార్థన చేస్తాము గాని దేవుడు మాట్లాడితే లోబడము.

మధ్యాకాశంలోకి ఆయన మేఘారూఢుడై రాబోతున్నారు. దేవుని యొక్క పిలుపు వినబడడానికి సిద్ధపడాలి. ప్రార్థన చేయడం వేరు ప్రభువు స్వరం వినడం వేరు లోబడడం వేరు. ప్రార్థన చేస్తున్నావు కాని ఈ దినం ప్రభువు మాట్లాడితే తీసికొనే మెట్టుందా? నీవు దేనికైనా సిద్ధమేనా? చాలాసార్లు ప్రార్థన చేసి మాట్లాడు ప్రభువా అని విసికిస్తాము. ప్రభువు మాట్లాడిన తరువాత లోబడము. అబ్రాము బొమ్మలు చేసికొంటున్నాడు హృదయంలో సమాధానం లేదు. వయస్సు పెరిగిపోతుంది నేనేంటి ఇలా ఉన్నాననే బాధ తనలో ఉంది. దేవుని పిలుపు కొరకై అబ్రాహాము ఎదురుచూస్తున్నాడు. దేవుని కొరకు సిద్ధపడి ఉన్నాడు. జీవముగలిగిన దేవుడు ఎవరైనా ఉంటే నాతో మాట్లాడితే నేనామాట విని లోబడతానని అనుకొంటున్న సమయములో దేవుడు అబ్రాహామును సంధించారు. నీవు లేచి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళు భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడునని దేవుడు అబ్రాహాముతో చెప్పెను. అబ్రాహాము దేవుని మాట విని ఆయన మాటకు లోబడి పూర్ణహృదయమతో ఆయనను వెంబడించాడు. ఎక్కడికి వెళ్తున్నాడో తెలియకుండానే బయలుదేరాడు. అడ్రస్ ఇవ్వకుండా ఎవరైన మనలను ఊరు వెళ్ళమంటె వెళ్ళలేము. అబ్రాహాము దేవుని మాట విన్నాడు ఆయన మాట అబ్రాహామును నడిపించెను. దేవుని యొక్క ఆత్మ అబ్రాహామును సంధించినప్పుడు తన జీవితంలోని పొరపాట్లను సరిచేసికొని విశ్వాసులకు తండ్రియైపోయాడు.

దేవుని మాట వినడానికి, దేవుని ఆజ్ఞలు గైకొనడానికి మారుమనస్సు పొందడానికి సిద్ధపడాలి. నీవు దేవుని ధవళసింహాసనం ముందు నిలువబడాలంటే మొట్ట మొదట దేవుని రాజ్యాన్ని ఆయన నీతిని వెదకాలి. ఇప్పుడు మనం దేవుని మందిరములో ముందు వరుసలో కనబడుతున్నాము మంచిదే రేపు ఆయన

రాజ్యంలో ఆయన ముందు కనబడగలుగుతామా? ఆయన కోటిసూర్యుల తేజస్సు కంటే అధికమైన తేజస్సు కలిగిన దేవుడు. ఆ గొప్ప దేవుని సన్నిధిలో నిలువబడాలంటే మారుమనస్సు పొంది పరిశుద్ధజీవితం చెయ్యాలి. దేవుని మాటకు ఆయన ఆజ్ఞకు లోబడి దేవుని చిత్తం చేయుట కొరకై సిద్ధపడాలి. నీ చదువును ఆపివేసి నన్ను వెంబడించుమని దేవుడంటే, నీ ఉద్యోగాన్ని విడిచిపెట్టి నన్ను వెంబడించుమని దేవుడు చెప్తే ఎంతమంది లోబడడానికి సిద్ధంగా ఉన్నారు? అబ్రాహాము సిద్ధంగా ఉన్నాడు. పేతురు యోహానులు దోనెలో తమ వలలు కడుగుకొంటు సిద్ధంగా ఉన్నారు, వలలు విడిచిపెట్టి నన్ను వెంబడించండి అని ప్రభువు వారితో చెప్పగా వారు ఆ మాటకు వెంటనే లోబడిరి. ఎవరి జీవితంలోనైతే దేవుని మాట వెంటనే వినే మెట్టు ఉంటుందో వారి దగ్గరికెళ్ళి ప్రభువు మాట్లాడుతారు. పరిచర్యలోనైనా సేవలోనైనా లోబడేవారికే పని చెప్తారు. దేవుడు కూడా పేతురును యోహానును చూచి వలలు విడిచిపెట్టి నన్ను వెంబడించుమని చెప్పారు. వారు వలలు విడిచిపెట్టారు ప్రభువును వెంబడించారు. వారు గొప్ప శిష్యులు అయ్యారు.

**"రాత్రివేళ దొంగ ఏలాగు వచ్చునో ఆలాగే ప్రభువు దినము వచ్చునని మీకు బాగుగా తెలియును" 1థెస్స.5:2.** ప్రభువు దినం దొంగవలె వస్తుంది. ఆయన వచ్చినప్పుడు ఆయనను ఎదుర్కొనుట కొరకై సిద్ధపడి ఉండాలి. ఆయన మధ్యాకాశంలోనికి రాబోతున్నారు. ఆయన వచ్చినప్పుడు ఆయనను ఎదుర్కోవాలి. **"సహోదరులారా, ఆ దినము దొంగవలె మీమీదికి వచ్చుటకు మీరు చీకటిలో ఉన్నవారుకారు" 1థెస్స. 5:4.** ఆయన దొంగవలె వచ్చినప్పుడు మనం వెలుగులో ఉండాలి. వెలుగులో ఉండాలంటే చీకటిలో నుండి బయటకు రావాలి. పాపాన్ని ఒప్పుకొని విడిచిపెట్టాలి. ప్రభువు పిలిచినప్పుడు, మనకాజ్ఞాపించినప్పుడు ఆయన ఆజ్ఞలు గైకొనడానికి ఆయన వచ్చినప్పుడు ఆయనను ఎదుర్కొనడానికి సిద్ధపడి ఉండాలి. ప్రభువు వచ్చినప్పుడు సిద్ధంగా ఉండి ప్రభువా నీ దగ్గరికి వస్తున్నానని చెప్పాలి.

**"ఒక కాలం వచ్చుచున్నది" ఆమోసు 4:2.** అది ఏ కాలమంటే ప్రభువు మధ్యకాశంలోనికి రాబోయే కాలం, తీర్పుతీర్చే కాలం, అంత్యకాలం రాబోతూ ఉంది. అందుకని ప్రభువు ఏమంటున్నారంటే **"ఇటు అటు తొలగకుండ.." ఆమోసు 3:1.** మనం లోకంలో ఉన్నాం కాబట్టి అటు ఇటు తొలగకూడదు.

చాలా రకాలైన మార్గాలు ఉంటాయి. ఆ మార్గాలలో రకరకాలైనటువంటి ఆలోచనలు, ముచ్చట్లు లేకపోతే హెచ్చరికలు మనకు వినబడతాయి. చాలా సంఘాలు, చాలా ఉపదేశములు, చాలా మంది సేవకులున్నప్పటికిని మనకివ్వబడినది శ్రేష్టమైనదనే గ్రహింపు మనకు కలిగితే అటు ఇటు తొలగిపోము. మెలకువగా ఉండాలి అటు ఇటు తొలగకూడదు అని ప్రభువు హెచ్చరిస్తున్నారు. కొన్నిసార్లు ఊగిసలాడుతూ ఉంటాము. టి.విలో చాలా సందేశాలు వినబడుతున్నాయి కదా ఇరవై నాలుగు గంటల శుభవార్త ఛానల్ ఉంది కదా మందిరానికి వెళ్ళకపోయినా ఫర్వాలేదు ఇంత గొప్ప వాక్యం వింటున్నాము కదా అని నీవు అనుకొంటున్నావు. వాక్యం వింటున్నావు దేవుని ఆరాధించగలుగుచున్నావా? పునరుత్థాన దినాన సమాజముగా చేరి ప్రభువును ఆరాధించాలి అని దేవుని వాక్యం సెలవిస్తుంది.

ప్రభువు దినాన ప్రభువు సన్నిధిలో నీవు కనబడాలంటే, మనుష్యకుమారుని యెదుట కనబడాలంటే అటు ఇటు ఆలోచన చేస్తే ఆయన యెదుట నిలువబడలేవు, కనబడలేవు. ఇరవై నాలుగు గంటలు గాలి కొట్టిందనుకొండి చెట్టు ఎలా ఉంటుంది ఆ గాలి మనం పీల్చుకోలేము, బయటికి రాలేము, పనిచేయలేము. నీవు ఇరవై నాలుగు గంటలు ఆలోచన చేస్తే భక్తి చేయలేవు. నీ ఆలోచనలు తెగిపోయిన గాలిపటంలా అటు ఇటు ఊగిసలాడకూడదు. ప్రభువు వచ్చినప్పుడు భళా నమ్మకమైన మంచి దాసుడా అనబడే గుంపులో నీవుండాలి. ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచువాడు పరలోకరాజ్యంలో ప్రవేశించడు గాని తండ్రి చిత్త ప్రకారం చేయువాడే పరలోకంలో ప్రవేశిస్తాడు. ఎవరు తండ్రి చిత్తం చేస్తారంటే ఆయన పిలిచినప్పుడు పలికేవారు, ఆయన మాటకు లోబడినవారు, ఆయన చెప్పింది చేసేవారే. మనుష్యులందరి యెదుట కనబడతాము, లోకంలో కనబడతాము, స్నేహితుల ముందు కనబడతాము. దేవుని ముందు కనబడడానికి ఈ దినం నీవు సిద్ధమా? మనం సిద్ధంగా లేము గనుకనే సిద్ధంగా ఉండాలని ప్రభువు హెచ్చరిస్తున్నారు. మన ప్రాణాత్మ శరీరములు పరిశుద్ధపరచుకొని నిర్దోషమైన, నిర్మలమైన మనస్సాక్షి కలిగి ప్రభువు మధ్యకాశంలోనికి వచ్చినప్పుడు ఆయనను ఎదుర్కోవడానికి, ఆయన సన్నిధిలో నిలువబడటానికి అవసరమైన సిద్ధపాటు పరిశుద్ధాత్మ దేవుడు మనకు దయచేయును గాక!

## దేవుని ప్రణాళిక

**"అయితే యాకోబూ, నిన్ను సృజించినవాడగు యెహోవా ఇశ్రాయేలూ, నిన్ను నిర్మించినవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు - నేను నిన్ను విమోచించియున్నాను భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను నీవు నా సొత్తు" యెషయా 43:1.**

ప్రభువు మనలను సృజించారు, నిర్మించారు, విమోచించారు. నిన్ను పిలిచిన దేవుడు నిన్ను తన సొత్తుగా చేసికొన్నారు.

**"నీవు నా దృష్టికి ప్రియుడవైనందున ఘనుడవైతివి నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక నీకు ప్రతిగా మనుష్యులను అప్పగించుచున్నాను నీ ప్రాణమునకు ప్రతిగా జనములను అప్పగించుచున్నాను" యెషయా 43:4.** విమోచింపబడిన ప్రజలు దేవునికి ప్రియులు. ఆయన దృష్టికి నీవు ప్రియుడవు గనుక ఘనుడవయ్యావు. తన చేతులతో నిన్ను నిర్మించిన దేవుడు నిన్ను ప్రేమిస్తున్నారు. ఆయన సొత్తైన నిన్ను ఆయన ఘనంగా చూస్తున్నారు. నీవు అన్ని విషయములలో ఘనముగా ఉండి ఆయన స్వారూప్యతలో పరిపూర్ణంగా ఉండాలని ఆయన కోరుచున్నాడు. అయితే నీ విలువ నీకు తెలియాలి ఏ కోణంలో ప్రభువు నిన్ను చూస్తున్నారో నీకు తెలియాలి.

**"నా నిమిత్తము నేను నిర్మించిన జనులు నా స్తోత్రమును ప్రచురము చేయుదురు" యెషయా 43:21.** ఆయన స్తోత్రం ప్రచురం చేయడానికి నియమించుకొన్నారు. ఆయన నిమిత్తం ఆయన మహిమ కొరకు నియమించుకొన్నారు. మనమాయనను స్తుతించాలి.

**"యాకోబు నివాసస్థలములను కరుణించి వాని గుడారములను నేను చెరలోనుండి రప్పింతును; అప్పుడు పట్టణము దాని కొండమీద కట్టబడును, నగరియు యథాప్రకారము నివాసులు గలదగును" యిర్మీయా 30:18.** దేవుని బిడ్డలారా! రక్షింపబడక ముందున్న వ్యర్థత్వం వేరు, రక్షించబడిన తరువాత హృదయంలో పేరుకొన్న చెత్తవేరు. భక్తిముసుగులో వుంటాము గనుక అది ఎవరికి కనబడదు. నీ ఊహలలో ఉద్దేశాలలో ఆలోచనలలో తలంపులలో ఉన్న వ్యర్థత్వం నిన్ను చెరగొని యున్నదా? దేవునికి నివాసస్థలంగా ఉండవలసిన

నీ హృదయం ఆత్మ శుద్ధీకరించబడాలి. నిన్ను దేవుడు ఎంత ప్రియముగా ఎంచుచున్నాడో ఎంత ప్రేమిస్తున్నారో నీవు గుర్తిస్తే దేవుని ఆత్మ నీలో పనిచేసి నీవు బంధింపబడిన చెరలో నుండి బయటకు వస్తావు. దేవుడు నిన్ను విడిపిస్తాడు. ఆయనకు నివాసస్థలముగా కొండమీదనున్న పట్టణంవలె చేస్తాడు. దేవుడు మనకు పిరికితనం కలిగిన ఆత్మను ఇవ్వలేదు గనుక నీ సాక్ష్యం పరిమళ వాసనవలె అనేకులకు ప్రకాశమానంగా వుండాలి. నీవు విడుదల పొందాలి కట్టబడాలి దేవుని నామాన్ని మహిమపరచాలి. ఆయన ఎక్కలేనంత ఎత్తైన కొండలపైకి నిన్ను ఎక్కిస్తాడు. నీవు ఆశతో విశ్వాసంతో అడిగిన చాలు. ఎక్కలేనంత అంటే ఖశ్చితంగా ఆటంకాలు ఉంటాయి. కాని నీవు విశ్వసిస్తే వాటిని అధిగమించే కృపను నీకిచ్చి నిన్నెక్కిస్తాడు. దేవుని ఆత్మ నీలోనికి వచ్చి సంపూర్ణంగా నీలోనున్న వ్యర్థత్వాన్ని కాల్చివేసి నిన్ను ఖాళీ పాత్రగా ఆయనకు నివాసస్థలంగా చేస్తారు

**"వాటిలో కృతజ్ఞతాస్తోత్రములను సంభ్రమపడువారి స్వరమును వినబడును, జనులు తక్కువమంది కాకుండ నేను వారిని విస్తరింపజేసెదను, అల్పులు కాకుండా నేను వారిని ఘనులుగా చేసెదను" యిర్మీయా 30:19.**

నీవు దేవుని బట్టి ఆనందించాలి స్తుతించాలి. సంతోషించి స్తోత్రములు చేయాలి. నా నిమిత్తము నేను నిర్మించిన జనులు నా స్తోత్రమును ప్రచురము చేయుదురు. స్తుతిలో ఎంతో శక్తి వున్నది. స్తుతించుట వలనే యెరికో గోడలు కూలిపోయాయి. మనం దేవుని కార్యాల కొరకు ప్రార్థన చేస్తాం వేచివుంటాము. అయితే ఆయనను కృతజ్ఞతతో స్తుతించబద్దులమై యున్నాము. మనము పాపమునుండి విడిపించబడిన తరువాత ఆయన మనలను అల్పులుగా వుంచడు. విస్తరింపచేస్తాడు. ఘనులుగా చేస్తాడు. మనలను ఆయన ప్రేమించుచున్నాడు గనుక మనుష్యులను అప్పగిస్తాడు. మన ప్రాణాన్ని ప్రియముగా ఎంచుకొనక పనిచేస్తే జనములను అప్పగిస్తాడు.

ఆయన నిన్ను ఘనముగా ఎంచగా నిన్ను తన చేతులతో నిర్మించి తన కోసము ప్రత్యేక జనముగా ఎంచి తన పరిపూర్ణతను నీ కివ్వాలని ఆయన చూస్తుండగా నిన్ను నీవు ఘనహీనముగా అల్పంగా ఏమి చేయలేనివారిగా ఎంచుకోవద్దు అలాగు పలుకవద్దు. మీలో నున్నవాడు లోకములోనున్నవానికంటే గొప్పవాడు.

# యరోబాము

యరోబాము అనగా ప్రజలు విస్తరింతురు అని అర్థము. ఇతడు యోసేపు సంతతివాడగు ఎఫ్రామీయుడు యొర్దానులోయయందలి జెరేదాయను ఊరివాడు ఇతని తండ్రి నెబాతు, తల్లి జెరూహ. యరోబాము సొలొమోను దాసుడు, మహాబలాఢ్యుడు, పనియందు శ్రద్ధగలవాడు, ధైర్యశాలి అతడు కష్టపడి పనిచేయుట సొలొమోను గమనించి యోసేపు గోత్రానికి చెందిన ప్రదేశములో వెట్టిపని చేసేవారిమీద అతనిని సొలొమోను అధికారిగా నియమించెను (1రాజులు 11:28).

సొలొమోను హృదయము దేవుని యొద్ద నుండి తొలగిపోయెను దేవుడు ఇచ్చిన ఆజ్ఞలను, నిబంధనలను, కట్టడలను గైకొనకపోవుట చూచి నీ రాజ్యము నీకుండకుండ నీ దాసునికిచ్చెదను అని సొలొమోనుతో చెప్పెను 1రాజులు 11:10-11. యరోబాము ఒక దినమున యెరూషలేము వెలుపట నుండగా అహీయా ప్రవక్త క్రొత్తవస్త్రము ధరించినవాడై అతని ఎదుర్కొని తన వస్త్రమును పండ్రెండు ముక్కలుగా చేసి ఇశ్రాయేలీయుల పదిగోత్రములమీద అతడు రాజగునని సూచించుటకు అందులో పదిముక్కలను యరోబామునకు ఇచ్చెను. దేవుడు చెప్పిన విధముగా పదిగోత్రములవారు యరోబామును రాజుగా నియమించుకొనిరి. యరోబాము యెహోవాను యథార్థముగా సేవించినయెడల తన సంతానము స్థిరముగా సింహాసనముమీద నుందురని అహీయా ప్రవక్త ఇతనికి హెచ్చరిక చేసెను 1రాజులు 11:37,38.

ప్రజలు ఏటేట దేవుని ఆరాధించుటకు యెరూషలేమునకు వెళ్ళుదురు. వారి హృదయము సొలొమోను కుమారుడైన రెహబాముతట్టు తిరుగునని తలంచి రెహబామును ప్రజలును తనపైబడి చంపుదురనుకొని దానులోను బేతేలులోను రెండు బంగారు దూడలు చేయించి (1రాజులు 12:28) ప్రజలతో మీరు యెరూషలేముకు వెళ్లడం చాలా కష్టం మిమ్ములను ఐగుప్తునుండి తెచ్చిన దేవుళ్లు ఇవే అని చెప్పి వారిని తప్పు మార్గములో నడిపించాడు. సీనాయి పర్వతము వద్ద అహరోను దూడను (నిర్గమ.32:4) చేసినట్లుగా యరోబాము రెండుదూడలు చేయించాడు. యెరూషలేములో ఉన్న ఆరాధనస్థలం ప్రజలను ఐక్యపరుస్తుంది అని యరోబాముకు తెలుసు కాని ధర్మశాస్త్రమును ఉల్లంఘించెను. ఆజ్ఞాతిక్రమమే

పాపము. యరోబాముకు దేవుని ఆజ్ఞలు, కట్టడలు, నిబంధనలు ప్రాముఖ్యముగా లేవు గాని తన అధికారమే ప్రాముఖ్యముగా ఎంచుకొన్నాడు. దానినే అంటిపెట్టుకొని ఉండాలని దేవుని శాసనములను మీరినాడు. ఇది దేవుని ప్రజలకు ఎంత హానిచేస్తున్నదో అతడు గ్రహించలేదు. యరోబాము విగ్రహారాధన చేయకూడదు అను దేవుని కఠినమైన ఆజ్ఞలను ధిక్కరించి బంగారు దూడలను చేయించెను. దూడలను ముందు పెట్టుకొని నిజదేవుని ఆరాధించాలని ప్రజలను పురికొల్పెను ఎంత భయంకరమైన సంఘటన ఇది. ఇట్టి నిర్ణయము దేవునికి ఎంతో అవమానమును, దుఃఖమును కలుగజేసినది.

లేవీ గోత్రికులైన యాజకులు విగ్రహారాధన చేయుటకు సమ్మతించనందున లేవీయులు కాని సాధారణమైన వారిని యాజకులుగా నియమించెను. బలిపీఠము, యాజకులు, ఆరాధన, అర్పణలు, పండుగలు మొదలైన వాటితో ఒక క్రొత్తమార్గము ఏర్పరచెను. అయితే ఇది అంతా దేవునికి అసహ్యమైనది. యూదాదేశములో కోతపండుగ 7వ మాసము 14వ దినమున ఆచరించవలెను. కాని యరోబాము తన రాజ్యములో 8వ మాసమున 15వ దినమున చేయవలెనని ఏర్పాటు చేసెను (1రాజులు 12:32-33). తాను కట్టిన బలిపీఠం దగ్గర యరోబాము ధూపం వేయడానికి నిలువబడినప్పుడు దేవుని ప్రవక్త యూదాప్రదేశము నుండి వచ్చి బేతేలులో చేరి ఆ బలిపీఠమునకు వ్యతిరేకముగా దేవుని సెలవు ప్రకారం ఈ బలిపీఠం బద్దలైపోయి దానిమీదనున్న బూడిదె ఒలికిపోతుంది అని పలికినప్పుడు ఆ మాటలు యరోబాము విని ఆ ప్రవక్తను పట్టుకోండి అని ఆ ప్రవక్తవైపు బలిపీఠం మీదనుండి తన చేయి చాపగా ఆ చేయి ఎండిపోయినది. దానిని వెనుకకు తీయుటకు అతనికి చేతకాలేదు 1రాజులు 13:1-4.

యరోబాముకు అధికారం కావాలి కాని దేవుని సందేశం అవసరంలేదు. అహీయా ప్రవక్తద్వారా దేవుడు రాజ్యమును నీకు అప్పగిస్తాడు అని చెప్పినప్పుడు తీసుకొన్నాడు కాని దేవునికి వ్యతిరేకంగా నడుస్తూ ఉంటే దేవుని దగ్గర నుండి వచ్చిన సందేశమును తీసికొనలేకపోయాడు. ప్రవక్త ద్వారా దేవుడు సెలవిచ్చిన మాట నెరవేరినది. అప్పుడు యరోబాము ప్రవక్తతో నా చెయ్యి బాగుపడునట్లు

నా కొరకు ప్రార్థించుము అని అడిగెను. ఎండిన యరోబాము చెయ్యి బాగు చెయ్యమని అడిగినట్లుగా ప్రజలు ఈ దినములలో మంచి ఆరోగ్యము ఉద్యోగం వివాహం పిల్లలు ఆశీర్వాదం కావాలని ప్రార్థించుమని అడుగుచున్నారు గాని నిజమైన పశ్చాత్తాపము కొరకు అంగలార్చలేకపోవుచున్నారు. పాపము ఒప్పుకొని విడిచిపెట్టుటకంటె దేవుడు సహాయం చేస్తే చాలు అని దేవుని వాక్యమునకు విధేయతను చూపలేకపోవుచున్నారు. యరోబాము తన చెయ్యి బాగైన తరువాత ప్రవక్తను ఇంటికి రమ్మని, సేదతీర్చుకోమని బహుమానం ఇస్తానని స్వార్థం కొరకు తనను వాడుకొనవలెనని ప్రయత్నించిన ఆ ప్రయత్నం విఫలమైపోయినది. ప్రజలకు దేవునితో సంబంధం లేకపోయినను ధైర్యం తెచ్చుకొని దేవుని సేవకులతో చాలా దగ్గర సంబంధము కలిగి వారిని ప్రేమిస్తారు. మంచి భోజనం పెట్టి కానుక కూడ ఇస్తారు కాని పరిశుద్ధులు ఇచ్చే దేవుని సందేశమును తీసికొనే మెట్టులో కనిపించుట లేదు.

దేవుడు యరోబామును దాసుని స్థితినుండి ఇశ్రాయేలు రాజుగా ఆశీర్వదించినప్పుడు మనస్సులో, హృదయములో గర్వించి దేవుని మరచి తన ఇష్టానుసారమైన మార్గములో నడిచి దేవుని ప్రజలను వక్రమార్గంలో నడిపించి ఎంతో ఘోరమైన పాపము చేయుటకు కారణమాయెను. యరోబాము శరీర స్వస్థతకొరకు ప్రార్థించమని అడిగెనుగాని వికృతంగా మారిపోయి ఎండిన హృదయస్థితిని గురించి ప్రాధేయపడలేదు.

ప్రియమైన దేవుని బిడ్డలారా! ఈ చివరి దినములలో దేవుని ఎలా ఆరాధిస్తున్నారు. క్రైస్తవ్యము ఎటు వెళ్లిపోవుచున్నది. దేవుని పేరట ఆరాధిస్తూ అన్యాచారములు, సాంప్రదాయాలు, కట్టడలు, నియమాలు ఆచరిస్తూ దేవుని దుఃఖకరముగా మారిపోతుంది. నీవు ఎటువంటి భక్తిని నేర్చుకొన్నావు? ఈ దినములలో ప్రజలకు అధికారం, డబ్బు, హోదా, పదవులు ఐశ్వర్యం ఉంటే సరిపోతుంది కాని దైవత్వము గురించి దేవుని ఆజ్ఞలను కట్టడలను మరచిపోవుచున్నారు.

పాపానికి దాసులముగా సాతానుకు బానిసలముగా ఉన్న మనలను ప్రభువు విమోచించి రాజులైన యాజక సమూహముగా చేస్తే ప్రభువు ప్రేమించి మనకొరకు చేసిన సిలువ బలియాగమును ఆయన త్యాగమును మరచి దేవుని

ఆజ్ఞలను ఉల్లంఘించి మనస్సునకు నచ్చిన కోణంలో భక్తి చేస్తున్నామా? దేవుని వాక్యానుసారమైన జీవితమును కలిగియున్నామా?

ప్రియమైన దేవుని బిడ్డలారా! ఇవి చివరి దినములు ఎండిన ఎముకలు మహాసైన్యముగా లేచిన విధముగా దేవుని ఆత్మ కుమ్మరింపబడవలెనని మనము ప్రార్థించవలెను. ఎండిన మన హృదయస్థితి, బలహీనమైన స్థితిని ఒప్పుకోలు చేసికొనవలెను. విశ్వాసములో ఎండిపోయామా? పరిశుద్ధజీవితం విషయములో ఎండిపోయామా? పరీక్షించుకొని పశ్చాత్తాపపడవలెను. ఈ సం॥ చివరి దినములలోనికి వచ్చేశాము నూతన సంవత్సరము మనముందు ఉన్నది. భయముతో వణకుతో మన నిర్జీవస్థితి, నిర్జీవ క్రియను విడిచి జీవముతో నింపబడి దేవుని సత్యమునకు లోబడి, దేవుని సింహాసనమునకు వ్యతిరేకంగా, పరిశుద్ధులకు విరోధముగా మన చేతులు ఎత్తకుండా మన ఎండిపోయిన ఆత్మీయస్థితి నిమిత్తం దేవుని కృపాసింహాసనం ఎదుట సాగిలపడి నూతన జీవంతో నింపబడి ఈ తరంలో మహిమకరమైన పాత్రలుగా చేయబడుటకు పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయము చేయునుగాక!

## సువార్త ఉజ్జీవ కూటములు

**2018 అక్టోబర్ 18,19,౨౦** **కనిగిరి**, ప్రకాశం జిల్లా,

**2018 అక్టోబర్ 22,23,24** **అవనిగడ్డ** , కృష్ణా జిల్లా

**2018 అక్టోబర్ 25,26,27** **వెంకటగిరి**, నెల్లూరు జిల్లా,

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2016-18

నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని అంతట నేను - చిత్తగించుము నేనున్నాను నన్ను పంపుము

- యెషయా 6:8

2018 సెప్టెంబర్ 26, 27, 28

ప్రతిరోజు సా॥6-30 ని॥లకు

# సువార్త ఉజ్జీవ సభలు

# L E M స్కూల్ గ్రౌండ్స్

## లాడ్జ్ సెంటర్, గుంటూరు



బ్రదర్ డి.అగస్టీన్ జెబకుమార్‌గారు

వ్యవస్థాపకులు / జనరల్ సెక్రటరీ, జేమ్స్ - బీహార్



పాస్టర్ జాన్‌వెస్లీగారు

హోసన్నా మినిస్ట్రీస్, రాజమండ్రి



బ్రదర్ దీవెనయ్యగారు

హోలీమినిస్ట్రీస్, బుడంపాడు

**UPF** గుంటూరు పాస్టర్ల సహకారముతో.....

వివరములకు : బ్రదర్ దానియేలు సెల్ నెం : **9705970545**

If undelivered please return to :

**Bro. DEEVANAIAH**, Editor,

*PARIPURNA VIDUDALA*

Horeb Prardhana Konda, **BUDAMPADU**

Etukuru - 522 017, Guntur Dist. A.P.

Phone : 9491475967, 9290901396

To,

Sri / Smt.

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 11th & 12th of Every Month